వెల్దండ పీఎస్‌లో నిర్బంధంలో మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు దంపతులు

మాజీ ఎమ్మెల్యే గువ్వలపై దౌర్జన్యం

- **దైవకార్యానికి వెళ్తుండగా అడ్డగింత**
- **రెండుగంటలపాటు వెల్దండ పీఎస్‌లోనే..**
- **పోలీసులు, కార్యకర్తల మధ్య తోపులాట**
- **హైదరాబాద్‌కు గువ్వల తరలింపు**

వెల్దండ, డిసెంబర్ 18: అచ్చంపేట మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజును పోలీసులు నిర్బంధించారు. లింగాల మండలం అంబట్‌పల్లి ఆలయంలో ధ్వజస్తంభ ప్రతిష్ఠాపనకు హాజరయ్యేందుకు గువ్వల, ఆయన సతీమణి అమల హైదరాబాద్ నుంచి బయలుదేరారు. ఈ విషయాన్ని బీఆర్ఎస్ శ్రేణులు సోషల్ మీడియాలో పెట్టగా, విషయం తెలుసుకున్న కాంగ్రెస్ నాయకులు గువ్వలను అడ్డుకోవాలని హాజీపూర్ చౌరస్తాలో సమావేశమయ్యారు. అప్రమత్తమైన పోలీసులు శాంతిభద్రతల సమస్య రాకుండా ముందస్తుగా వెల్దండ వద్ద గువ్వల వాహనాలను అడ్డుకొని, గువ్వల దంపతులను అదుపులోకి తీసుకున్నారు. ఠాణాలో రెండు గంటలపాటు వారితోపాటు నాయకులను నిర్బంధించారు. విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, గువ్వల అభిమానులు వందలాదిగా ఠాణాకు తరలివచ్చారు. పీఎస్ ఎదుట బైఠాయించి తమ నేతను ఎందుకు అడ్డుకున్నారో చెప్పాలని నిలదీశారు. వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. దీంతో గువ్వలను హైదరాబాద్‌కు తరలించేందుకు బయటకు తీసుకురాగా, గులాబీశ్రేణులు అడ్డుకున్నాయి. ఈ క్రమంలో పోలీసులు, కార్యకర్త ల మధ్య తోపులాట జరిగింది. కల్వకుర్తి డీఎస్పీ పార్థసారథి గువ్వల దంపతులను హైదరాబాద్‌లోని వారి స్వగృహానికి తరలించారు.

కాంగ్రెస్‌ది అధికార దుర్వినియోగం : గువ్వల

కాంగ్రెస్ అధికారం చేపట్టి 10రోజులు కాకముందే అధికార దుర్వినియోగానికి పాల్పడుతుందని గువ్వల బాలరాజు ఆరోపించారు. వెల్దండ ఠాణాలో ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో అరాచక పాలన కొనసాగుతున్నదని ధ్వజమెత్తారు. దైవకార్యానికి వెళ్లే తమను పోలీసులతో అడ్డగించడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. సీఎం సొంత నియోజకవర్గంలో శాంతిభద్రతలను అదుపులో పెట్టుకోలేని సీఎం, ప్రజలకు ఎలాంటి పాలన అందిస్తారని నిలదీశారు. ఇంత అరాచకం సృష్టిస్తారా? అని ప్రశ్నించారు. బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలను భయభ్రాంతులకు గురి చేస్తే సహించేంది లేదని తేల్చి చెప్పారు.

- **మంత్రులకు అంజన్‌కుమార్‌యాదవ్ సన్మానం**

పలువురు మంత్రులను, కాంగ్రెస్ ఎమ్మెల్యేలను టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు అంజన్‌కుమార్ యాదవ్ సన్మానించారు. హైదరాబాద్ ఎమ్మెల్యేల నివాస సముదాయంలో సోమవారం రాత్రి ఘనంగా సత్కరించారు. శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు జూపల్లి కృష్ణారావు, ఏఐసీసీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్‌రావ్ ఠాక్రే, ఎమ్మెల్యేలు, పలువురు ఏఐసీసీ నాయకులను అంజన్‌కుమార్ శాలువాలు, పూలమాలతో సన్మానించారు.

ఒకే కుటుంబంలో ఆరుగురి హత్య

మొదటిపేజీ తరువాయి...

అనుకొన్న పథకం ప్రకారమే హత్యలు చేసినట్టు సమాచారం. స్నేహితుడు ప్రసాద్ ఆస్తిని కొల్లగొట్టాలనే కుట్రతో ఇదంతా చేసినట్టు స్పష్టమవుతున్నది. కామారెడ్డి జిల్లా సదాశివనగర్ మండలం భూంపల్లి శివారులో డిసెంబర్ 14న వెలుగు చూసిన ఓ యువతి మృతదేహంతో అప్రమత్తమైన పోలీసులు.. లోతుగా దర్యాప్తు చేయగా ఈ విషయం బయటపడింది.

సీరియల్ హత్యల వెనుక నేపథ్యమిది

పోలీసులు, మాక్లూర్ గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం హంతకుడు ప్రశాంత్, హత్యకు గురైన ప్రసాద్ కుటుంబానిది నిజామాబాద్ జిల్లా మాక్లూర్ మండల కేంద్రమే స్వగ్రామం. రాచర్లకూన ప్రసాద్ అనే వ్యక్తి ఉపాధి కోసం గల్ఫ్‌కు వెళ్లి రెండేండ్ల క్రితం సొంతూరికి తిరిగొచ్చాడు. గల్ఫ్‌లో ఉన్నప్పుడే ప్రసాద్ మూలంగా మోసపోయిన ఇదే గ్రామానికి చెందిన ఓ యువతి ఒంటిపై కిరోసిన్ పోసుకొని ఆత్మహత్య చేసుకొన్నది. ఈ ఘటనతో ప్రసాద్ కుటుంబం ఇల్లు వదిలి వేరే గ్రామానికెళ్లి స్థిరపడింది. ప్రసాద్ తన పేరిట ఉన్న ఎకరం భూమిని బాధిత కుటుంబానికి రాసిచ్చి ఈ వ్యవహారాన్ని ముగించుకొన్నాడు. ఓ అమాయక యువతి ప్రాణాలను బలిగొన్న కారణంగా గ్రామంలో ప్రసాద్ కుటుంబంతో ఎవ్వరూ సత్సంబంధాలు పెట్టుకోకపోవడంతో కామారెడ్డి జిల్లా మాచారెడ్డికి వెళ్లి తన కుటుంబంతో ప్రసాద్ బతుకుతున్నాడు. ఈ సమయంలో స్వగ్రామానికి చెందిన ప్రశాంత్ అనే యువకుడితో పరిచయం ఏర్పడింది. కుటుంబ పోషణకు అప్పు కోసం చూస్తున్న సమయంలో ప్రసాద్‌కు ప్రశాంత్ దగ్గరయ్యాడు. యువతి మృతి కేసులో నిందితుడిగా ఉన్నందున ఆస్తి బదలాయింపు కష్టం అవుతుందని చెప్పి తన పేరిట ఆస్తులు రాసిస్తే లోన్ ఇప్పిస్తానంటూ ప్రసాద్‌ను ప్రశాంత్ నమ్మబలికాడు. ఇదంతా నిజమేనని నమ్మి తన రెండు ఇండ్లు, ఒక ప్లాట్‌ను రాసిచ్చాడు. కొద్దిరోజులకు ప్రసాద్‌కు చెందిన ఒక ఇంటిని చెప్పా పెట్టకుండా వేరే వ్యక్తికి ప్రశాంత్ విక్రయించాడు. ఈ విషయం తెలియడంతో ప్రశాంత్‌ను ప్రసాద్ నిలదీశాడు. ఇరువురి మధ్య కొద్దికాలంలోనే మొదలైన స్నేహం కాస్తా తీవ్ర వైరంగా మారింది. ఇల్లు విక్రయానికి సంబంధించిన డబ్బును ఇవ్వాలని డిమాండ్ చేయడంతో తనకు రాజకీయ ప్రాబల్యం ఉందంటూ ప్రశాంత్ బెదిరింపులకు దిగాడు. వారం, పది రోజులుగా ఇరువురి మధ్య జరుగుతున్న జగడం ముదరడంతో ప్రసాద్‌ను, ఆయన కుటుంబాన్ని మట్టుపెట్టాలని ప్రశాంత్ నిర్ణయించుకొన్నాడు. స్థిరాస్తికి సంబంధించి హక్కుదారులెవ్వరూ ఉండకూడదని భావించి కుటుంబం మొత్తాన్ని హత్య చేయాలని నిర్ణయానికి వచ్చి ఈ ఘాతుకానికి పాల్పడ్డట్టుగా పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించారు.

ప్రశాంత్ చేతిలో హతమైన ప్రసాద్, స్వప్న, ప్రవంతి, రమణి, చైత్రిక, చైత్రిక్ (ఫైల్)

ఎలా హత్యచేశాడంటే?

కామారెడ్డి జిల్లా సదాశివనగర్ మండలం భూంపల్లి గ్రామ శివారులో జాతీయ రహదారి 44కు ఐదు కిలో మీటర్ల దూరంలో డిసెంబర్ 14న హత్యకు గురైన దివ్యాంగురాలైన ఓ యువతి మృతదేహాన్ని పోలీసులు గుర్తించారు. లైంగికదాడి చేసి పెట్రోల్ పోసి నిప్పుపెట్టిన ఈ ఘటనపై పోలీసులు లోతుగా దర్యాప్తు చేశారు. చుట్టుపక్కల సీసీ టీవీలను పరిశీలించగా ఒక అనుమానాస్పద కారును గుర్తించినట్టు తెలిసింది. ఈ కారు నంబర్‌తోపాటు సెల్‌ఫోన్ సిగ్నల్ డాటాను విశ్లేషించగా మాక్లూర్ మండలంలోని ప్రశాంత్ అనే యువకుడికి సంబంధించిన ఆనవాళ్లు బహిర్గతం అయ్యాయి. సదరు నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకొని విచారించగా నివ్వెరపోయే వాస్తవాలు వెలుగుచూశాయి. నిందితుడు చెప్పిన వివరాల మేరకు హత్యా వివరాలు ఇలా ఉన్నాయి.

1. *డబ్బులిస్తానని నమ్మబలికి తొలుత రాచర్లకూన ప్రసాద్‌ను ప్రశాంత్ తన వెంట తీసుకెళ్లాడు. డిచ్‌పల్లి హైవే పక్కన హత్య చేశాడు. అక్కడే పూడ్చిపెట్టాడు.*
2. *కొన్నిరోజులుగా ప్రసాద్ కనిపించకపోవడంతో అప్పులిచ్చినవారు అతడిపై ఫిర్యాదు చేశారు. దీంతో ప్రసాద్‌ను పోలీసులు అదుపులోకి తీసుకొన్నారని వెంటనే పోలీస్‌స్టేషన్‌కు రావాలని ప్రసాద్ భార్య రమణిని నమ్మించాడు. తన వెంట తీసుకొని వెళ్లి బాసర వద్ద హత్యచేసి, గోదావరిలో పడేశాడు.*
3. *ప్రసాద్, అతడి భార్యను పోలీసులు అదుపులోకి తీసుకున్నారని నమ్మించి ప్రసాద్ చెల్లి స్వప్న (దివ్యాంగురాలు)ను తీసుకెళ్లి హత్య చేశాడు. మృతదేహాన్ని కనిపించకుండా చేశాడు.*
4. *ప్రసాద్ తల్లికి మాయమాటలు చెప్పి అతడి పిల్లలిద్దరినీ నిజామాబాద్, నిర్మల్ జిల్లా సరిహద్దులోని సోన్ బ్రిడ్జి వద్దకు తీసుకెళ్లి కిరాతకంగా చంపేసి, మృతదేహాలను కాలువలో పడేశాడు. అందులో ఒక మృతదేహం ఈ నెల 8న లభించగా, సోమవారం మరో మృతదేహం దొరికింది.*
5. *వీరందరూ పోలీసుల అదుపులో ఉన్నారని నమ్మించి ప్రసాద్ మరో చెల్లి ప్రవంతిని ప్రశాంత్ తన వెంట తీసుకెళ్లాడు. ఆమెకు నిప్పంటించి చంపేశాడు.*

కూపీ లాగితే కదిలిన డొంక

ప్రసాద్, అతడి భార్యను పోలీసులు అరెస్టు చేశారని నమ్మబలికి ప్రసాద్ ఇద్దరి చెల్లెళ్లు స్వప్న (దివ్యాంగురాలు), ప్రవంతిని వేర్వేరుగా హంతకులు చంపేశారు. ఇందులో ఒకరి మృతదేహం భూంపల్లి శివారులో దొరకడంతోనే ఈ ఘాతుకం వెలుగులోకి వచ్చింది. వరుసగా మొదటి మూడు హత్యలను ప్రశాంత్ ఒక్కడే చేసినట్టుగా తెలుస్తున్నది. మిగిలిన హత్యలను ప్రశాంత్ సన్నిహితులైన మైనర్లు చేసినట్టు సమాచారం. నిందితులను కామారెడ్డి జిల్లా సదాశివనగర్ పోలీసులు అదుపులో తీసుకొని విచారిస్తున్నారు. త్వరలోనే పూర్తి వివరాలను పోలీసు ఉన్నతాధికారులు అధికారికంగా వెల్లడించే అవకాశం ఉంది. ఆరుగురి హత్య ఉదంతంలో డిసెంబర్ 8న ప్రసాద్ కూతురు చైత్రిక, డిసెంబర్ 5న చేగుంటలో చెల్లె స్రవంతి, డిసెంబర్ 14న భూంపల్లిలో మరో చెల్లె స్వప్న (దివ్యాంగురాలు), డిసెంబర్ 18న కుమారుడు చైత్రిక్ మృతదేహాలను సోన్ బ్రిడ్జి(నిజామాబాద్ – నిర్మల్ సరిహద్దు) వద్ద పోలీసులు గుర్తించారు. ప్రసాద్, రమణి మృతదేహాలను వెలికి తీసే పనిలో పోలీసులు ఉన్నారు.

మోసాలకు కేరాఫ్ ప్రశాంత్

సీరియల్ కిల్లర్ ప్రశాంత్ వయసు 25 ఏండ్లే. పేద కుటుంబమే అయినా జల్సాలు చేసేవాడు. కొత్త కార్లు, బైక్‌లను కొని గ్రామంలో షో చేస్తుండటంతో కొంత మందిలో అతడిని ఫాలోఅయ్యేవారు. చిన్న వయసులోనే మాయమాటలు చెప్పడంలో ఆరితేరిన ప్రశాంత్‌కు ఇంతకు మునుపు భూ లావాదేవీల విషయంలో పదుల సంఖ్యలో ప్రజలను మోసం చేసిన చరిత్ర ఉన్నది. వ్యవసాయ భూములకు రుణాలు ఇప్పిస్తానంటూ తన పేరిట ఆస్తులను రాయించుకోవడం.. వాటిని వేరే వ్యక్తులకు అమ్మేసి జల్సాలు చేయడం రివాజుగా మారింది. ఎవరైనా ప్రశ్నిస్తే తనకు పొలిటికల్ బ్యాక్‌గ్రౌండ్ ఉందంటూ పలువురి ఫొటోలు చూపిస్తూ బెదిరింపులకు దిగడం పరిపాటిగా మారింది. మొన్నటి వరకు సైకిల్ కూడా లేని వ్యక్తి ఒక్కసారిగా కొత్త కారు, హైఫై సోకులను చూసి అమాయకులు అతరి బుట్టలో పడిపోయారు. ఇలా చాలా మంది మోసపోయి లబోదిబోమనగా ప్రసాద్ కుటుంబమైతే ఏకంగా ప్రాణాలే కోల్పోవాల్సి వచ్చింది. ఇదిలా ఉండగా ప్రశాంత్ నడిపించిన భూ దందాల్లో లోతుగా విచారణ చేస్తే మరికొంతమంది అదృశ్యమైన వ్యక్తుల వివరాలు బయటపడే అవకాశాలున్నట్టు మాక్లూర్ ప్రజలు భావిస్తున్నారు. అయితే ప్రశాంత్ చేతిలో హత్యకు గురైన ప్రసాద్ సైతం గతంలో ఒక యువతి ఆత్మహత్య కేసులో నిందితుడు కాగా పలువురిని మోసం చేసిన కేసుల్లోనూ ముద్దాయి కావడం విశేషం.

- **కానిస్టేబుళ్లు ఎస్సైలుగా రిటైరవ్వాలి**

కానిస్టేబుళ్ల ఎస్సైలుగా రిటైరయ్యేలా సంస్కరణలు తీసుకురావాలని డీజీపీ రవిగుప్తా ద్వారా సీఎం రేవంత్‌రెడ్డికి రాష్ట్ర పోలీసు అధికారుల సంఘం విన్నవించింది. సోమవారం ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వై గోపిరెడ్డి ఆధ్వర్యంలో డీజీపీ రవిగుప్తాకు వినతిపత్రం అందించారు. డీజీపీకి వినతిపత్రం ఇచ్చినవారిలో ఎన్ శంకర్‌రెడ్డి, సీహెచ్ భద్రారెడ్డి, మల్లికార్జున్ ఉన్నారు.

బెట్టింగ్‌కు కుటుంబాలు బలి

‘ఆన్‌లైన్ గేములతో అంతా పోగొట్టుకున్నాను. నేను చచ్చిపోతున్నా. నా చావుకు మా నాన్నే కారణం. నా కోసం వెతకొద్దు’ అంటూ యాదాద్రి భువనగిరికి చెందిన చేకూరి ప్రసాద్ చివరసారిగా సెల్ఫీ వీడియో షేర్‌చేసి అదృశ్యమయ్యాడు. సిద్దిపేటకు చెందిన కానిస్టేబుల్ నరేశ్ ఆన్‌లైన్ బెట్టింగ్ కారణంగా అప్పుల ఊబిలో కూరుకుపోయాడు. ఈ నెల 15న భార్య, ఇద్దరు పిల్లలను గన్‌తో కాల్చి.. తానూ కాల్చుకొని తనువు చాలించాడు. చౌటుప్పల్ గతంలో ఓ మహిళ నీటి సంపులోకి ఇద్దరు కన్న బిడ్డలను తోసేసి తాను ప్రాణాలు తీసుకున్నది. ఈ హృదయ విదారక ఘటనలు మన కండ్లముందు కదలాడుతూనే ఉన్నాయి. బయట పడినవి కొన్ని మాత్రమే. వెలుగులోకి రానివి మరెన్నో..! ఆన్‌లైన్ బెట్టింగ్ వ్యసనానికి బలైన కుటుంబాలు ఇంకెన్నో!!

- **ఇటీవల కుటుంబాన్ని కాల్చి చంపిన కానిస్టేబుల్**
- **నేడు చనిపోతున్నానంటూ చేకూరి ప్రసాద్ అదృశ్యం**
- **తక్కువ డబ్బు తో ముగ్గులోకి.. ఆనక మొత్తం ఊడ్చేసి**
- **దేశవ్యాప్తంగా 4.21 కోట్ల మంది ఆన్‌లైన్ గేమర్లు**
- **వేల కోట్ల మోసాలు.. బయటపడలేక ఆత్మహత్యలు**
- **సంచలనం రేకెత్తిస్తున్న బెట్టింగ్ యాప్స్ ఘటనలు**

భార్యపిల్లలను చంపి, ఆత్మహత్య చేసుకొన్న కానిస్టేబుల్ నరేశ్ (ఫైల్)

హైదరాబాద్, డిసెంబర్ 18 (నమస్తే తెలంగాణ): టీ-20లు, వన్డేలు, ఐపీఎల్, ఆఖరికి టెస్ట్ మ్యాచ్ అయినా.. ప్రో కబడ్డీ లీగ్ అయినా.. రమ్మీ పేకాటైనా.. వీడియో గేమ్స్ అయినా కాదేదీ ఆన్‌లైన్ మోసానికి అనర్హం. ఇవేనా.. ఆన్‌లైన్ స్పాట్, బ్లాక్ జాక్, రౌలెట్టె, బక్కార్ట్, పోకర్, తీన్‌పట్టి, అందర్ బాహర్, ఆన్‌లైన్ క్యాషినో.. ఇలా చెప్పుకుంటూ పోతే అడ్డంగా దోచుకొనే గ్యాంబ్లింగ్ యాప్‌లు ఆన్‌లైన్‌లో కోకొల్లలు. గతేడాది దేశవ్యాప్తంగా 4.21 కోట్ల మంది ఆన్‌లైన్ గేమర్స్‌గా నమోదయ్యారంటే అతిశయోక్తి కాదు. అందుకే ఆన్‌లైన్ మోసాలు పెరిగిపోతున్నాయి. మొదట రూపాయల్లో ఆశపెట్టి.. వందల్లో లాభాలు చూపిస్తారు. తర్వాత వేలల్లో ఆశ పెట్టి.. లక్షల్లో దోచేస్తారు. రాష్ట్రంలో సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన వస్తుండటంతో సైబర్ నేరగాళ్లు ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌లను రూపొందిస్తున్నట్టు పోలీసు అధికారులు చెప్తున్నారు. పలు రకాల గేమ్‌లపై ప్రజల్లో ఉన్న మోజును క్యాష్ చేసుకునేందుకు.. నకిలీ యాప్‌లను సృష్టించి, వాటి ద్వారా సులువుగా డబ్బులు దండుకుంటున్నారు. కొన్ని యాప్‌లలో వారే రుణాలు ఇస్తూ మళ్లీ డబ్బులు కట్టించి, అదే గేమ్‌కు బానిసను చేస్తున్నారు.

విదేశాల నుంచి నిర్వహణ

ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్ నిర్వాహకులు చైనా, సౌదీ అరేబియా, అరబ్ దేశాల నుంచి ఆపరేటింగ్ చేస్తుంటారు. ఇటీవల ఛత్తీస్‌గఢ్‌లో వెలుగుచూసిన ‘మహదేవ్’ యాప్ కేసులో ఇదే తేలింది. ప్రముఖులతో యాడ్స్ ఇప్పించడం, అమాయకులను ముగ్గులోకి దించడం, వారి ద్వారా డబ్బులు వసూలు చేయడం, మొత్తంగా గేమ్స్‌కు బానిసలు చేయడం నిత్యకృత్యమైంది. కొన్ని బెట్టింగ్ యాప్‌లకు ఉగ్రవాదులు నిధులు సమకూర్చుతున్నారు. వచ్చిన లాభాలను తమ కార్యకలపాలకు వినియోగిస్తున్నారు. మహదేవ్ యాప్ కేసులో ఇప్పటి వరకు సుమారు 260 మందిని అరెస్టు చేశారు. ఆన్‌లైన్ గేమ్స్ వల్ల అమాయకులు కోట్లాది రూపాయలు మోసపోతున్నారు. ఆటపై ఉన్న ఇష్టాన్ని వ్యసనంగా మార్చడం తోపాటు తెలివిగా డబ్బులు పెట్టించి, మోసగించడంలో నిపుణులైన యాప్ ఆపరేటర్లకు సుమారు 25-30 శాతం కమీషన్ వెళ్తున్నట్లు ఇండియన్ సైబర్ క్రైమ్ కోఆర్డినేషన్ సెంటర్ (ఐ4సీ) తెలిపింది. ఈ ఏడాది ఇప్పటివరకు ఆన్‌లైన్ గేమ్ మోసాలపై 8 వేలకుపైగా కేసులు నమోదైనట్టు ఐ4సీ ఇటీవల తెలిపింది. ఒక్క మహదేవ్ యాప్ ద్వారానే రూ.6 వేల కోట్ల మోసం జరిగినట్టు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అధికారులు గుర్తించారు. కేంద్ర ప్రభుత్వం 22 బెట్టింగ్ యాప్‌లను గుర్తించి బ్యాన్ చేసింది .

స్మార్ట్‌ఫోన్ వాడకం తగ్గించండి

ఆన్‌లైన్ వేదికగా ప్రపంచమంతా ఎన్నో దారుణాలు జరుగుతున్న క్రమంలో స్మార్ట్ ఫోన్ వాడకం తగ్గించడం మేలు. ఖాళీగా ఉంటూ ఏదైనా చూస్తున్నా కొద్దీ.. ఏవేవో ప్రకటనలు, ఆకర్షించే బొమ్మలు, గేమ్స్, ఇతరాలు దర్శనమిస్తూనే ఉంటాయి. అప్పటికే ఏదైనా గేమ్‌పై ఆసక్తి ఉంటే.. దానిని ఆడాలనిపిస్తుంది. అది వ్యసనంగా మారుతుంది. తర్వాత డబ్బులు పెట్టి, నష్టపోయే స్థితికి చేర్చుతుంది. దానివల్ల ఎన్నో అనర్థాలు. ఇంట్లో ఇబ్బందులు, అప్పుల గొడవలు, మనస్పర్థలు, ప్రశాంతత లేక ఆత్మహత్యల ఆలోచనలు. స్థిమితంగా ఆలోచించండి. ఆన్‌లైన్ గేమ్స్ వ్యసనం నుంచి బయటపడండి. అవసరమైతే కౌన్సెలింగ్ తీసుకోండి.

– డాక్టర్ అనంత్, సైకాలజిస్ట్

బస్సుల జోలికొస్తే ఊరుకోం

- **ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనార్ హెచ్చరిక**
- **బిగ్‌బాస్ ఫైనల్స్ సందర్భంగా రెచ్చిపోయిన అల్లరి మూకలు**
- **జూబ్లిహిల్స్‌లో బస్సులపై దాడులు**
- **పల్లవి ప్రశాంత్‌సహా పలువురిపై కేసు**

హైదరాబాద్, డిసెంబర్ 18 (నమస్తే తెలంగాణ) /బంజారాహిల్స్: ఆర్టీసీ బస్సుల జోలికొస్తే ఊరుకునేది లేదని టీఎస్ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనార్ హెచ్చరించారు. బిగ్‌బాస్ సీజన్-7 విజేతల ప్రకటన సందర్భంగా అన్నపూర్ణ స్టూడియోస్ దగ్గర చోటుచేసుకున్న ఘటన నేపథ్యంలో టీఎస్ఆర్టీసీ ఎండీ ట్విట్టర్ వేదికగా స్పందించారు. ఆర్టీసీ బస్సులపై దాడి చేయడమంటే సమాజంపై దాడి చేసినట్టేనని పేర్కొన్నారు. ఇలాంటి ఘటనలను టీఎస్ఆర్టీసీ యాజమాన్యం ఉపేక్షించదని స్పష్టం చేశారు. బస్సులు ప్రజల ఆస్తి అని, వాటిని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని రాసుకొచ్చారు.

అసలేం జరిగిందంటే..

ఆదివారం రాత్రి బిగ్‌బాస్ సీజన్-7 గ్రాండ్ ఫైనల్ విజేత ప్రకటన నేపథ్యంలో జూబ్లీహిల్స్‌లోని అన్నపూర్ణ స్టూడియోస్ వద్దకు బిగ్‌బాస్ పోటీదారుల అభిమానులు వందలాదిగా చేరుకున్నారు. జూబ్లీహిల్స్ పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. విజేతగా పల్లవి ప్రశాంత్ పేరును ప్రకటించగానే అభిమానులు నినాదాలు ప్రారంభించారు. అక్కడే ఉన్న రన్నరప్ అమర్‌దీప్ అభిమానులూ పోటీగా నినాదాలు చేయడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. అమర్‌దీప్ బయటకు రాగా, ఆయన కారు అద్దాలను ప్రశాంత్ అభిమానులు పగలగొట్టి దాడికి యత్నించారు. పోలీసులు చెదరగొట్టి అమర్‌దీప్‌ను పంపించేశారు. గతంలో బిగ్‌బాస్‌లో పాల్గొన్న గీతూరాయల్ స్టూడియోలో నుంచి బయటకు రాగా ఆమె కారు అద్దాలనూ ధ్వంసం చేశారు. ఆమె పట్ల అసభ్యంగా ప్రవర్తించారు. దీంతో పోలీసులు మరోసారి లాఠీలకు పనిచెప్పారు. స్టూడియో బయట పరిస్థితిని దృష్టిలో ఉంచుకొని పోలీసులు పల్లవి ప్రశాంత్‌ను రెండో గేటు నుంచి బయటకు పంపగా, కారులో వెళ్లిపోయిన ప్రశాంత్ కాసేపటికి ఓపెన్ టాప్ జీపులో స్టూడియోస్ వద్దకు రావడంతో పరిస్థితి అదుపు తప్పింది.

కేసులు నమోదు చేసిన పోలీసులు

ఆర్టీసీ డ్రైవర్ ఎండీ ఖాసీం ఫిర్యాదుతో గుర్తుతెలియని వ్యక్తులపై ఐపీసీ 147, 148, 427 రెడ్‌విత్ 149తోపాటు 3 పీడీపీపీ యాక్ట్ కింద కేసులు నమోదయ్యాయి. పల్లవి ప్రశాంత్, అతడి డ్రైవర్ సహా పలువురిపై ఐపీసీ 147, 148, 290, 353, 427 రెడ్‌విత్ 149 సెక్షన్లతోపాటు 3 పీడీపీపీ యాక్ట్ కింద పోలీసులు మరో కేసు నమోదు చేశారు.

ప్రాణం మీదికి తెచ్చిన ఆన్‌లైన్ గేమ్

- **నా చావుకు మా నాన్నే కారణమని వ్యక్తి సెల్ఫీ వీడియో**
- **దొరకని ఆచూకీ.. గాలిస్తున్న స్నేహితులు, బంధువులు**

సెల్ఫీ వీడియోలో ఏడుస్తున్న ప్రసాద్

భువనగిరి అర్బన్, డిసెంబర్ 18: ఆన్‌లైన్ గేమ్ ఓ వ్యక్తి ప్రాణం మీదికి తెచ్చింది. గేమ్‌లో డబ్బులు పోవడంతో ఆత్మహత్యకు పాల్పడుతున్నట్టు సెల్ఫీ వీడియో తీసి ఫోన్ స్విచ్చాప్ చేసి అజ్ఞాతంలోకి వెళ్లాడు. యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి మండలంలోని బండసోమారం గ్రామానికి చెందిన చెరుకూరి గౌరయ్యకు ఇద్దరు కుమారులు, కూతురు. పెద్ద కుమారుడు ప్రసాద్‌కు ఆరేండ్ల క్రితం వివాహమైంది. అతనికి కుమార్తె, కుమారుడు ఉన్నారు. అత్తగారిచ్చిన ఎకరం భూమిని సాగుచేసుకుంటూ జీవనం సాగిస్తున్న ప్రసాద్.. వ్యాపారం చేయాలని ఆ భూమిని రూ.32 లక్షలకు అమ్మాడు. చేతిలో డబ్బులు ఉండటంతో అత్యాశకు పోయి ఆన్‌లైన్ గేమ్ ఆడాడు. తొలుత రూ.5 లక్షల వరకు పోగొట్టుకున్నాడు. కుటుంబ అవసరాలకు మరో రూ.5 లక్షలు ఖర్చు చేశాడు. డబ్బులు పోతుండటంతో తండ్రి పేరున ఉన్న వ్యవసాయ భూమిలో కోళ్ల ఫారం పెడతానని అడిగాడు. ఫారం వద్దు వ్యవసాయమే చేసుకోమ్మని తండ్రి సూచించాడు. తన వద్ద ఉన్న మరో రూ.17 లక్షలతో ఓపెన్ ప్లాట్ కొన్నాడు ప్రసాద్. ఆన్‌లైన్ గేమ్‌కు బానిసైన ప్రసాద్.. ప్లాట్ పేపర్లు తాకట్టు పెట్టి రూ.15 లక్షల అప్పు తెచ్చుకున్నాడు. ఆ డబ్బంతా ఆన్‌లైన్ గేమ్‌లో పోవడంతో కుటుంబసభ్యులు మందలించారు. రెండు సెల్ఫీ వీడియోలు తీసి గ్రామ వాట్సాప్ గ్రూప్‌లో సోమవారం పోస్టు చేశాడు. ఫోన్ స్విచ్చాప్ చేసుకున్నాడు. కుటుంబసభ్యులు, గ్రామస్థులు అతడి కోసం వెతుకుతున్నారు. వలిగొండ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. నేటికీ అతడి ఆచూకీ లభించలేదు.

జూనియర్ డాక్టర్ల సమ్మె తాత్కాలిక వాయిదా

హైదరాబాద్, డిసెంబర్ 18 (నమస్తే తెలంగాణ): జూనియర్ డాక్టర్లు, సీనియర్ రెసిడెంట్లు మంగళవారం నుంచి నిర్వహించనున్న సమ్మె తాత్కాలికంగా వాయిదా పడింది. తమకు గౌరవ వేతనం అందడం లేదంటూ, అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదంటూ మంగళవారం నుంచి ఓపీ, ఆపరేషన్ థియేటర్ సేవలను బహిష్కరించనున్నట్టు జూనియర్ డాక్టర్ల అసోసియేషన్, సీనియర్ రెసిడెంట్ డాక్టర్ల అసోసియేషన్ ప్రకటించాయి. సోమవారం వైద్యారోగ్య శాఖ కార్యదర్శి, డీఎంఈ సంయుక్తంగా జూనియర్ డాక్టర్ల, ఎస్ఆర్డీఏ సంఘాల ప్రతినిధులను పిలిపించుకొని చర్చలు జరిపారు. స్టైపెండ్ ఎందుకు ఆలస్యమైందో వివరించారు. అనంతరం మంత్రి రాజనర్సింహ వారితో ఫోన్‌లో చర్చలు జరిపారు. సమస్యను పరిష్కరిస్తానని చెప్పారు. మంగళవారం సచివాలయానికి రావాలని కోరారు. ఈ నేపథ్యంలో సమ్మెను తాత్కాలికంగా వాయిదా వేస్తున్నట్టు సంఘాలు ప్రకటించాయి. మంత్రితో చర్చల అనంతరం తుది నిర్ణయం ప్రకటిస్తామని తెలిపాయి.

లోకం పోకడ

మనమే వాటికి ఆహారం అయ్యాం!

స్పోర్ట్స్ కాంప్లెక్స్‌కు 10 ఎకరాలు కేటాయింపు

హైదరాబాద్, డిసెంబర్ 18 (నమస్తే తెలంగాణ): యాదాద్రి భువనగిరి జిల్లాలో నిర్మించనున్న స్పోర్ట్స్ కాంప్లెక్స్‌కు ప్రభుత్వం 10 ఎకరాల భూమిని కేటాయించింది. భువనగిరి మండలం రాయగిరి గ్రామంలోని సర్వే నంబర్ 259లో ఈ స్థలాన్ని కేటాయిస్తూ రెవెన్యూ శాఖ సోమవారం ఉత్తర్వులు జారీచేసింది. యువజన సర్వీసులు, పర్యాటక, సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో మల్టీ పర్పస్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ (స్టేడియం) నిర్మించనున్నది. ఇందుకోసం ప్రభుత్వానికి రూ.95 లక్షలు చెల్లించింది.

యువ శాస్త్రవేత్తలు కొత్త సాంకేతికతను అందివ్వాలి

బిట్స్ పిలానీ సదస్సులో ఇస్రో డైరెక్టర్ శ్రీకాంత్

జవహర్‌నగర్, డిసెంబర్ 18: మనవ జీవన ప్రయాణం సాంకేతికతతోనే ఆరంభమవుతుందని చంద్రయాన్-3 మిషన్ డైరెక్టర్ శ్రీకాంత్ అన్నారు. చంద్రయాన్-3తో ప్రపంచ దేశాలకు ఇస్రో ఆదర్శంగా నిలిచిందని తెలిపారు. బిట్స్ పి